క్లుప్తంగా

ధ్యానంతో మేధో వికాసం



పిరమిడ్ కేంద్రంలో మాట్లాడుతున్న సదానందగిరి స్వామీజీ

మామిడికుదురు: ధ్యానం ద్వారా మానవుల్లో మేధస్సు వికసిస్తుందని హిమాలయ యోగి సంత్ సదానందగిరి స్వామీజీ మహరాజ్ పేర్కొన్నారు. లూటుకుర్రులో ఏర్పాటు చేసిన ఘంగా శ్రీహరిరావు శ్రీచక్ర పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రశాంతతో కూడిన మనస్సు, మంచి ఏకాగ్రత ధ్యానం వల్ల లభిస్తాయన్నారు. ధ్యానం ద్వారా దేహానికి అంతర్గత బలం చేకూరుతుందని చెప్పారు. మన మనస్సు ఆందోళన నుంచి విముక్తి పొందాలంటే ధ్యానం చేయాలన్నారు. కార్యక్రమంలో ఘంటా సుదర్శనరావు, మధుసూదనరావు, స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా లక్షపత్రి పూజ

అంబాజీపేట: పుల్లేటికుర్రులో వేంచేసిన బాలా త్రిపుర సుందరి సమేత వ్యాఘ్రేశ్వర స్వామి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలో స్వామికి లక్షపత్రి పూజను బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి రుద్రహోమం, సూర్యనమస్కారాలు, సుందరకాండ పారాయణ తదితర పూజలను వేద పండితుల నడుమ నిర్వహించారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతులు ఆర్థిక పురోభివృద్ధి చెందేలా మెరుగైన సేవలు అందించేలా కృషి చేద్దామని బీకేఎస్ మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. పుల్లేటికుర్రు సొసైటీ వద్ద బీకేఎస్ మండల కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. బీకేఎస్ అభివృద్ధికి కృషి చేసి ముందుకు సాగాలని తీర్మానించారు. సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సన్నాహక సభ



కార్యక్రమ కరపత్రాన్ని విడుదల చేస్తున్న నిర్వాహకులు

అయినవిల్లి: మండలంలోని నేదునూరులో సమరసతా సేవా ఫౌండేషన్, విశ్వహిందూ పరిషత్‌లు సంయుక్త ఆధ్వర్యంలో రావి ఫౌండేషన్ వద్ద ఫౌండేషన్ సెక్రటరీ పాలగుమ్మి వెంకటకృష్ణ అధ్యక్షతన బుధవారం సన్నాహక సభ నిర్వహించారు. ఈ సభలో సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యుడువాసంశెట్టి కార్తిక్ మాట్లాడుతూ జనవరి 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం సభ ముఖ్య ఉద్దేశాలు వివరించారు. దేవాలయ పరిరక్షణ కోసం, సనాతన ధర్మ రక్షణ కోసం చేస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కార్యక్రమం కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ అయినవిల్లి మండల ధర్మ రక్షక్ వేంకటేశ్వరరావు, వీహెచ్‌పీ అయినవిల్లి మండల అధ్యక్షుడు రామకృష్ణ, కల్వపల్లి సుబ్బరాజు, గుమ్మడి వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు గంజి వీరన్నబాబు, గోకరకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



లక్కవరంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మలికిపురం: హోసన్న ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో లక్కరం ఆదర్శ కాలనీలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ కోట పుష్పకుమారి ప్రారంభించారు. పాస్టర్ లక్కవరపు యోహాన్ మట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. నిరుపేదలకు కంటి వైద్య పరీక్షలు చేసి ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా చేయిస్తామన్నారు. 10 మందికి ఆపరేషన్ అవసరమని వైద్యులు గుర్తించారన్నారు. ఉప సర్పంచ్ ఉలిశెట్టి లక్ష్మణరావు, శెట్టం ప్రమీల, కోట ఏసురత్నం, శెట్టం శ్రీనివాస్, లంకా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో విజయనగరంలో జరగనున్న ఈ మహాసభల నేపథ్యంలో రూపొందించిన మహాసభల వాల్‌పోస్టర్‌ను జిల్లా అధ్యక్షుడు వెంకట్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, విద్యార్థి సంఘాల ప్రతినిధులందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దినదిన గండమే..



మొగలికుదురులో ప్రమాదకరంగా మారిన వంతెన



ఆదుర్రు శివారు మోరిపాలంలో ప్రమాదకరంగా పైప్ కల్వర్టు

- ఆ వంతెనలపై ప్రయాణం ప్రమాదం
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని పాలకులు

మామిడికుదురు: రహదారులు అభివృద్ధికి నోచుకున్నా ఆ స్థాయిలో వంతెనలు ఆధునీకరణకు నోచుకోకపోవడంతో ప్రయాణికులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. ఇరుకు వంతెనలతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వంతెనలు పాడైపోయి ప్రమాదకరంగా మారాయి. ఇరుకుగా ఉండడంతో పాటు వంతెనల రెయిలింగ్స్ విరిగిపోయి ప్రమాదాలకు నెలవుగా మారాయి. పలువురు ఈ వంతెనలపై నుంచి పడి మృత్యువాత పడ్డా ఫలితం లేదు. ఎంతో కాలంగా వంతెనల దుస్థితి ఇదే విధంగా ఉన్నా వీటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీసం విరిగిపోయిన వంతెనల రెయిలింగ్స్ సంగతి కూడా పట్టించుకోవడం లేదు. ప్రమాదకరంగా మారిన వంతెనల పరిస్థితిపై ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వినిపిస్తున్నా అధికారుల్లో మాత్రం చలనం కనిపించడం లేదు.

గ్రామీణ మార్గాల్లోనూ తప్పని తిప్పలు

గ్రామీణ ప్రాంతాల్లో వంతెనల పరిస్థితి ఇదే విధంగా ఉంది. మొగలికుదురు ప్రధాన రహదారిలో బైర్రాజు ఫౌండేషన్ కేంద్రం సమీపాన వంతెన చాలా ఇరుకుగా ఉంది. దీనికి ఇరువైపులా రెయిలింగ్స్ విరిగిపోయాయి. ఇక్కడ గతంలో ఇద్దరు మృత్యువాత పడినా నేటికీ ఈ వంతెన అభివృద్ధికి నోచుకోలేదు. ఈదరాడ–కొమరాడ సెంటర్‌లో డ్యామ్ వద్ద వంతెన కూడా ఇదే విధంగా ఉంది. దీనిని కూడా అభివృద్ధి చేయాల్సి ఉంది. నగరం బీయస్ మూర్తి రోడ్డులో ప్రాథమిక పాఠశాల వద్ద డ్రైన్‌పై వంతెన, ఇదే మార్గంలో ఈదరాడ రోడ్డు జంక్షన్‌లో పంట కాలువపై వంతెన పరిస్థితి ఇంచుమించు ఇదే స్థితి. ఆదుర్రు శివారు మోరిపాలంలో డ్రైన్‌పై పైప్ కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఇక్కడ రోడ్డు కోతకు గురై ప్రమాదకరం పరిస్థితి ఏర్పడింది. పాడైపోయిన వంతెనల స్థానే కొత్త వంతెనల నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి నూతన వంతెనల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

పట్టించుకునే వారేరీ!

అయినవిల్లి: పొట్టిలంక, కొండుకుదురు గ్రామాలకు మంచినీటిని మండలంలోని కొండుకుదురు పీడబ్ల్యూడీ స్కీమ్ ద్వారా కొండుకుదురు పంచాయతీ అధికారులు సరఫరా చేస్తున్నారు. అయితే ఈ పైపులైన్ ముమ్మిడివరం మండలం రాణేలంక వారధి మీదుగా వెళ్లింది. ఈ పైపు లైన్ వారధిపై పలుచోట్ల లీకులు పడటంతో పూర్తి స్థాయిలో ఈ రెండు లంక గ్రామాల ప్రజలకు తాగునీరు పూర్తి స్థాయిలో అందడం లేదని స్థానికులు వాపోతున్నారు. పొట్టిలంక, కొండుకుదురులంక గ్రామాల వాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. లీకులను సరిచేయాల్సిన పంచాయతీ అధికారులు మిన్నకుండిపోవడంతో ఈ రెండు గ్రామాల్లో తాగునీటికి అవస్థలు పడుతున్నారు. దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా గ్రామ స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. లీకు సరిచేయాలని కోరుతున్నారు. దీనిపై ఈఓపీఆర్డీ వాణిశ్రీ బెహరాను వివరణ కోరగా పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తామన్నారు.



పైపులైన్ లీకవడంతో రహదారిపైకి చేరుతున్న తాగునీరు

ఘనంగా వన సమారాధనలు

మామిడికుదురు: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మగటపల్లి పార్వతీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు ఈ అన్న సమారాధనకు హాజరయ్యారు. పార్వతీ సమేత చంద్రమౌళీశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక భక్తి గీతాల విభావరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

రాజులపాలెంలో

పి.గన్నవరం: రాజులపాలెంలోని రామాలయం వద్ద వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, కోనసీమ క్షత్రియ సేవాసంఘం కోఆర్డినేటర్ ఇందుకూరి నర్సింహరాజు, నాగమణి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం కార్తిక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఉసిరిచెట్టు వద్ద భక్తులు పూజలు చేశారు. నర్సింహరాజు ఆధ్వర్యంలో గత పదిహేడేళ్లుగా వన సమారాధన నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో క్షత్రియ సంఘ నాయకులు ముదునూరి నర్సింహరాజు, పేరిచర్ల కృష్ణంరాజు, పెనుమత్స విశ్వనాథరాజు, కేఎస్ఎస్ రాజు, ఉయ్యూరి సోమరాజు, ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల అధినేత ఆర్.గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



రాజులపాలెంలో ఉసిరిచెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కోతలు త్వరగా పూర్తి చేసుకోవాలి



వక్కలంకలో రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

అంబాజీపేట: బంగాళాఖాతంలో ఈ నెల 23న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో కోత దశలో ఉన్న వాటిని రెండు రోజుల్లోగా రైతులు పూర్తి చేసుకోవాలని కోనసీమ జిల్లా వ్యవసాయ అధికారి వి. బోసుబాబు సూచించారు. వక్కలంకలో మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బోసుబాబు మాట్లాడుతూ వాతావరణ శాఖ హెచ్చరిస్తుండటంతో కోత దశలో ఉన్న వరిచేల కోతలను 23కి ముందు పూర్తి చేయాలని లేకుంటే వాయిదా వేసుకోవాలన్నారు. కోసిన వరి పంటను, ధాన్యాన్ని పల్లపు ప్రాంతాల్లో ఉంచకుండా మెరక ప్రాంతాల్లోకి తరలించాలన్నారు. వచ్చే నెల 15 నాటికి వరి నాట్లు వేసేలా రైతులు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి వక్కలంకలో ప్రకృతి సేద్య పద్ధతిలో సాగు చేస్తున్న రైతు గుత్తుల ధర్మారావు పొలాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఏఈఓ డి.దుర్గారావు, ఉద్యానశాఖ విస్తరణాధికారి డి.వెంకటేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు బి.సౌజన్య, రైతులు గొల్లపల్లి పల్లయ్య, పిల్లి వ్యాఘ్రేశ్వరరావు, యాళ్ల సత్యనారాయణ, అప్పారి సత్యనారాయ తదితరులు పాల్గొన్నారు.

వీవీ మెరకలో..

సఖినేటిపల్లి: రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతికత తదితర అంశాల్లో అవగాహన కల్పించేందుకు ఉయ్యూరి వారి మెరక గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సర్పంచ్ ఓగూరి రత్నకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు రైతులకు అవగాహన కల్పించారు. రైతులు చేపట్టే సాగునకు సంబంధించి అన్ని అంశాలకు వ్యవసాయ సిబ్బంది సహకారం అందిస్తారన్నారు. నాయకులు ఉయ్యూరు హరరాజు, ఓగూరి బాబులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రమదానంతో తూరల ఏర్పాటు



మామిడికుదురులో తూరలు ఏర్పాటు చేస్తున్న రైతులు

మామిడికుదురు: గ్రామ పంచాయతీ సమకూర్చిన తూరలను రైతులు శ్రమదానంతో బుధవారం ఏర్పాటు చేశారు. మామిడికుదురు పంట కాలువ నుంచి ఈర్లచెరువు వెళ్లే 13వ నంబర్ పంట బోదె తూరలు పాడైపోయాయి. దీంతో రైతులు సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ కాలువ ద్వారా సుమారు 50 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సరఫరా కావాల్సి ఉంది. కానీ తూరలు దెబ్బతినడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పంచాయతీ దృష్టికి తీసుకు వెళ్లడంతో స్పందించిన సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్ స్పందించారు. పంచాయతీ ద్వారా తూరలు సమకూర్చారు. ఆ తూరలను రైతులు శ్రమదానంతో ఏర్పాటు చేశారు. జేసీబీ సహాయంతో ఆర్అండ్‌బీ రోడ్డును తవ్వి తూరలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మాల ఉద్యమానికి సన్నద్ధ సభ

రావులపాలెం: రాజ్యాంగాన్ని, హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పేందుకు త్వరలో మాలలు భారీ లాంగ్ మార్చ్ నిర్వహించి, భారీ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా సన్నాహక సభలు నిర్వహిస్తున్నామని జేఏసీ జిల్లా కన్వీనర్ ఇసుకపట్ల రఘుబాబు అన్నారు. జిల్లా మాల సన్నద్ధ సభ పేరుతో బుధవారం రావులపాలెం ఆదిలక్ష్మినగర్‌లో జేఏసీ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఇసుకపట్ల రఘుబాబు, జాంగా బాబురావు, కోట రామ్మోహన్‌రావు, నెల్లి లక్ష్మీపతి హాజరై మాట్లాడారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని, రిజర్వేషన్ వర్గీకరణలో ఏకపక్షంగా వ్యవహరిస్తూ, ఎస్సీలను విభజించి అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. దీనికి భారీ స్థాయిలో ఉద్యమాలతో బుద్ధి చెప్పాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రఘుబాబు

బెల్ట్ షాపు నిర్వాహకులపై కేసు

ఆలమూరు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో బుధవారం నిర్వహించిన దాడుల్లో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు కథనం ప్రకారం సర్కిల్ పరిధిలోని మండపేటలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మండపేటకు చెందిన కె.శ్రీనివాసును అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మరో కేసులో యానాం నుంచి మద్యం అక్రమంగా తరలిస్తున్న ఎం.రాజేష్‌ని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రెండు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సొసైటీలతోనే రైతుల సుస్థిరాభివృద్ధి

అంబాజీపేట: ప్రకృతిపై ఆధారపడి అహర్నిశలు వ్యవసాయం సాగిస్తున్న రైతులకు సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధన సొసైటీల వల్లే సాధ్యమవుతుందని డివిజనల్ సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు అన్నారు. స్థానిక సొసైటీలో బుధవారం సహకార వారోత్సవాల ముగింపు సభ జరిగింది. స్థానిక సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి ఐ.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథి రాధాకృష్ణారావు మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులకు సొసైటీల ద్వారా తక్కువ వడ్డీలకు రుణాలు అందిస్తున్నామన్నారు. దీనివల్ల సుస్థిర సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ముగింపు సభలో సహకార వారోత్సవాల ఇన్‌చార్జి ఆదిమూలం వెంకటేస్వరరావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ మాజీ చైర్మన్‌లు గణపతివీరరాఘవులు, కొర్లపాటి కోటబాబు, దొమ్మేటి సత్యమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలి

ఆలమూరు: మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని జొన్నాడలో బుధవారం చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ జరిగింది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక(జేవీవీ) మండల శాఖ అధ్యక్షుడు ఖాన్, ప్రధానోపాధ్యాయులు అనంత శ్రీనివాస్, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు అద్దరి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ చెకుముకి టాలెంట్ టెస్టు పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో చెముడులంక జెడ్పీ హైస్కూల్ (ప్రథమ), నర్సిపూడి జెడ్పీ హైస్కూల్ (ద్వితీయ), మూలస్థాన అగ్రహారం జెడ్పీ హైస్కూల్ (తృతీయ) స్థానాలు సాధించారు. ఆ పాఠశాలల విద్యార్థులందరికీ నిర్వాహకులు మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు వైవీ రమణ, జి.సుదర్శన్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానానికి చిరునామా గ్రంథాలయాలు

- ముగిసిన వారోత్సవాలు
- విద్యార్థులకు బహుమతుల అందజేత

అంబాజీపేట: విజ్ఞానానికి చిరునామా గ్రంథాలయాలని, జ్ఞానసంపదను పొందగలిగే పవిత్రమైన ప్రదేశమని ఎంఈఓ–2 మోకా ప్రకాష్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం అంబాజీపేట శాఖ గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం జరగింది. ఎంఈఓ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి లైబ్రరీని అలవాటు చేసుకోవడం వల్ల ప్రయోజనం పొందుతారన్నారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: గ్రంథాలయాల్లో ఎన్నో విలువైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటి సేవలను విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈఓ మోకా వెంకన్నబాబు సూచించారు. మామిడికుదురు గ్రంథాలయంలో బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ గ్రంథాలయాధికారి ఎ.సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది. వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈఓ వెంకన్నబాబు మాట్లాడుతూ ఎంతో మంది ప్రముఖులు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలు చదువుకుని ప్రయోజకులయ్యారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.సాయిబాబు, బీడీసీ యెరుబండి కన్నబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద లైబ్రేరియన్ జి.రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని విద్యార్థులకు వివిధ పోటీలు రకాల నిర్వహించారు. వ్యాసరచన, వృక్తృత్వం, చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో విజేతలకు పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పి.గన్నవరం లిటిల్ ఏంజల్స్ కరస్పాండెంట్ జోమీ వర్గీస్, విశ్రాంత ఉపాధ్యాయుడు సాకా సత్యం, ప్రభుదాస్, భీమేంద్ర, నేలపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



పి.గన్నవరంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం ప్రసాద్

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలను అంతర్వేదిపాలెం శాఖా గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాన కనక లింగేశ్వరరావు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. గ్రంథాలయ అధికారి వై.వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు కె.నాగేశ్వరరావు, చింతా శ్యామ్ బాబు, కె.రాంబాబు, బీర అశోక్ తదితరులు పాల్గొన్నారు.



రాజోలులో విద్యార్థికి ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు కనకలింగేశ్వరరావు

రాజోలులో..

రాజోలు: గ్రంథాలయాలు విద్యార్థుల విజయాలకు సోపానాలుగా నిలుస్తున్నాయని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అన్నారు. బుధవారం డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన చక్కటి పుస్తకాలు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, దిన, వార పత్రికలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. లైబ్రేరియన్ జగదీష్, వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, పీఆర్వో నల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: విద్యార్థులు పుస్తక పఠనంతో మంచి క్రమశిక్షణను అలవాటు చేసుకోవచ్చని విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు గ్రంథాలయం అనేది మంచి వనరు అన్నారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎన్‌వీవీ జానకిరామ్, రాణి, సత్యనారాయణ, పాపారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెంలో..

రావులపాలెం: నేటి యువత పెడదారిన పడకుండా ఉండాలంటే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి. శ్రీనివాసరావు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం కళాశాలలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ అధికారి, ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పుస్తక ప్రదర్శనను ఉపాధ్యాయులు, విద్యార్థులు తిలకించారు.